స్వస్థలాలకు ఒడిశా కూలీలు



పెద్దపల్లిరూరల్: రంగాపూర్ ఇటుక బట్టీల్లో వలస కూలీలతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారనే ఫిర్యాదుపై అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. ఉపాధికోసం వలస వెళ్లిన కూలీలతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారంటూ ఒడిశా ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడి అధికారులు మన జిల్లా కలెక్టర్‌కు సమాచారం అందించారు. తమ రాష్ట్ర కూలీలకు విముక్తి కల్పించాలని విన్నవించారు. స్పందించిన కలెక్టర్.. రెవెన్యూ, కార్మిక, పోలీసు శాఖ అధికారులను విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్ రాజ్‌కుమార్, కార్మికశాఖ అధికారి హేమలత తదితరులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. 15 మంది వలసకూలీలు తాము ఇక్కడ ఉండలేమని అధికారులకు మొరపెట్టుకున్నారు. తాము సొంత ఊళ్లకు వెళ్తామని వారు పేర్కొనడంతో వారందరినీ రైలులో వారి స్వస్థలాలకు పంపించినట్లు కార్మికశాఖ అధికారి హేమలత తెలిపారు.

న్యూస్‌రీల్

భూ సమస్యలు పరిష్కరించండి



రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

రామగుండం: భూ సంబంధిత సమస్యలపై వచ్చే దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. రెవెన్యూ యాక్ట్ రికవరీ ఫైళ్లు పరిశీలించారు. మీ సేవా కేంద్రాల ద్వారా వచ్చే దరఖాస్తులను పరిశీలించి ధ్రువీకరణపత్రాలను జారీ చేయాలని సూచించారు. అనంతరం రెవెన్యూ పరమైన అంశాలపై స్థానిక తహసీల్దార్ కుమారస్వామికి పలు సూచనలు, సలహాలిచ్చారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ



పనులు ప్రారంభిస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మారం(ధర్మపురి): సీఎం రేవంత్‌రెడ్డి విద్య, వైద్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ అన్నారు. నందిమేడారంలోని ప్రభుత్వ బాలుర గురుకుల విద్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు సదానందం తన సొంత ఖర్చుతో చేపట్టిన పారిశుధ్య పనులను ప్రభుత్వ విప్ ప్రారంభించి మాట్లాడారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి ఉన్నత స్థానంలో ఉండేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సోగాల తిరుపతి, నాయకులు దేవి అఖిల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ క్వార్టర్ల కూల్చివేత



క్వార్టర్ కూల్చివేస్తున్న జేసీబీ

గోదావరిఖని: స్థానిక ప్రధాన చౌరస్తా వద్ద చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా శుక్రవారం మూడు సింగరేణి క్వార్టర్లను యాజమాన్యం కూల్చివేసింది. వాస్తవానికి 72 క్వార్టర్లను కూల్చివేసేందుకు ప్రణాళిక రూపొందించింది. అయితే, అందులో నివాసం ఉంటున్న సింగరేణి ఉద్యోగులు హైకోర్టుకు వెళ్లడంతో కూల్చివేత ప్రక్రియ వాయిదా పడింది. ప్రస్తుతం ఖాళీగా ఉన్న, అభ్యంతరం లేని క్వార్టర్ల కూల్చివేత చేపట్టారు. వైట్‌హౌస్ పక్కనున్న క్వార్టర్‌తోపాటు మరో రెండింటిని కూల్చివేశయగా, త్వరలోనే మరిన్నింటిని కూల్చివేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

జిల్లా మత్స్యశాఖ అధికారి బదిలీ

సాక్షి ఎఫెక్ట్..

పెద్దపల్లిరూరల్: జిల్లా మత్స్యశాఖ అధికారి భాస్కర్ నాయక్ బదిలీ అయ్యారు. ఆయనను ఆదిలాబాద్ బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. చేపపిల్లల పరిమాణం చిన్నగా ఉందని, నాసిరకం చేపపిల్లలు సరఫరా చేశారని పేర్కొంటూ జిల్లాలోని మత్స్యకారులు నిరసన తెలిపారు. ప్రధానంగా అంతర్గాం, రామగుండం, పాలకుర్తి, మంథని మండలాల్లోని మత్స్యకారులు మత్స్య సహకార సంఘం చైర్మన్ కొలిపాక నర్సయ్య, నాయకులు కొలిపాక శ్రీనివాస్, క్రాంతి తదితరులతో కలిసి ఆందోళనలు చేశారు. మత్స్యశాఖ ఉన్నతాధికారులు, మంత్రి శ్రీధర్‌బాబుకు ఫిర్యాదు చేశారు. దీనిపై 'చిన్నబోయిన చేప' శీర్షికన ఈనెల 23న 'సాక్షి' కథనం కూడా ప్రచురించింది. స్పందించిన ఉన్నతాధికారులు జిల్లా మత్స్యఅధికారి భాస్కర్ నాయక్‌ను ఆదిలాబాద్ బదిలీ చేశారు. సుల్తానాబాద్ ఎఫ్‌డీవో నరేశ్‌కుమార్ నాయుడుకు జిల్లా మత్స్యశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

పత్తి క్వింటాలు రూ.6,810

పెద్దపల్లిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం 572 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశామని ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. గరిష్టంగా క్వింటాలుకు రూ.6,810, కనిష్టంగా రూ.6,200, సగటు ధర రూ.6,600 గా నమోదైందని ఆయన వివరించారు.

అక్కడ అలా.. ఇక్కడ ఇలా.. ఎందుకలా?

- పెద్దపల్లిలో ఉచితంగా ఇసుక సరఫరా
- మంథని, రామగుండంలో ట్యాక్స్ వసూలు చేస్తున్న వైనం
- జిల్లా అంతటా ఒకే పాలసీ అమలు చేయాలి
- మంథని, రామగుండం వాసుల డిమాండ్

జిల్లా సమాచారం

ఇసుక క్వారీలు	03
నమోదైన ట్రాక్టర్లు	1,506
జనవరి నుంచి ఇప్పటివరకు బుకింగ్(టిప్పుల్లో)	21,000
సమకూరిన ఆదాయం (రూ.కోట్లలో)	5.93



మానేరు నుంచి ఇసుక తరలిస్తున్నట్రాక్టర్లు

సాక్షి, పెద్దపల్లి: స్థానికంగా నివాసాలు నిర్మించుకునే వారికి తక్కువ ధరకే ఇసుక సరఫరా చేసేందుకు జిల్లాలో 'మన ఇసుక.. మన విధానం'(స్యాండ్ ట్యాక్స్ పాలసీ) అమలులోకి తీసుకొచ్చారు. అయితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్దపల్లి నియోజకవర్గంలో స్థానిక అవసరాలకు ట్యాక్స్ లేకుండానే పూర్తిగా ఉచితంగా ఇసుక అందిస్తున్నారు. కానీ, ముత్తారం, విలోచవరం, గోలివాడలోని క్వారీల్లో ఇసుకపై ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. తమ నియోజకవర్గాల్లోనూ ఇళ్లు నిర్మించుకునే వారికి ఉచితంగానే ఇసుక పంపిణీ చేయాలని మంథని, రామగుండం నియోజకవర్గాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మరోపక్క.. ఇసుకపై ట్యాక్స్ విధించకుంటే అక్రమంగా తరలిపోయే అవకాశం ఉందని, దానితోపాటు ప్రభుత్వం ఆదాయం కోల్పోతుందని, ఇదెక్కడి ఇసుక పాలసీ అని పర్యావరణ ప్రేమికులు ప్రశ్నిస్తున్నారు.

మాకూ ఉచితంగా ఇవ్వండి

డంప్ చేసి అక్రమంగా రవాణా చేయబోమని పెద్దపల్లి ట్రాక్టర్స్ యజమానులు లిఖిత పూర్వక హామీ పత్రాలు రాసి ఇవ్వడంతో స్థానిక ఎమ్మెల్యే విజయరమణారావు నియోజకవర్గంలో స్యాండ్ ట్యాక్స్ లేకుండానే ఇసుక సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నారు. అయితే, మంథని, రామగుండం నియోజకవర్గాల్లోని స్థానికులు తమ అవసరాలకు సమీపంలోని గోదావరి నది, మానేరు నుంచి ఇసుక తీసుకోవడానికి డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ నియోజకవర్గాల్లో సైతం ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ట్యాక్స్ మొదలైందే జిల్లా నుంచే

జిల్లాలో గోదావరి నది, మానేరు నుంచి ఇసుక అక్రమ రవాణా కట్టడికి 'మన ఇసుక' పేరిట స్యాండ్ పాలసీ తీసుకొచ్చారు. ఇసుక సరఫరా చేసేందుకు రూ.25 వేల డిపాజిట్‌తో ట్రాక్టర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. దీంతో జిల్లాలో 1,506 మంది ట్రాక్టరు యజమానులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకే నిర్దేశిత ప్రాంతం నుంచి ఇసుక సరఫరా చేసేలా ప్రణాళిక రూపొందించారు. ఇసుక కావాల్సిన వారు ఆన్‌లైన్‌లో నిర్దేశిత రుసుం చెల్లించి బుక్ చేసుకోవాలి. ఒక ట్రాక్టర్ బుక్ చేసుకుంటే అందులో మూడు క్యూబిక్ మీటర్ల ఇసుక సరఫరా చేయాల్సి ఉంటుంది. ట్రిప్పుకు రూ.420తో లోడింగ్, రవాణా, ఇంధనం ఖర్చులకు 5 కి.మీ. దూరం వరకు రూ.1,160, గరిష్టంగా 41కి.మీ.– 45 కి.మీ. వరకు రూ.4,280 గా ట్యాక్స్ నిర్ణయించి వసూలు చేస్తున్నారు. వీటిలో ట్రాక్టర్ యజమానులకు లోడింగ్, రవాణా, ఇంధనం ఖర్చు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తున్నారు. రూ.420 ప్రభుత్వ ఖజానాకు చేరుతోంది. అందులో రూ.120 సీనరేజీ, డీఎంఎఫ్‌టీకి రూ.36, ఐటీ చార్జీలకు రూ.5, అడ్మినిస్ట్రేషన్ చార్జీలకు రూ.150, సాఫ్ట్‌వేర్ చార్జీల కింద రూ.59, సంబంధిత గ్రామాభివృద్ధి నిధుల(వీడీఎఫ్) కింద రూ.50 జమవుతాయి. ఈ విధానం జిల్లాలో సత్ఫలితాలు ఇవ్వడంతో ఇదే పాలసీని రాష్ట్రమంతా విస్తరించారు.

భారం తగ్గుతుంది



స్యాండ్ ట్యాక్స్‌తో భారం పడుతుంది. రామగుండం కార్పొరేషన్‌లో 50 డివిజన్లతోపాటు పాలకుర్తి, అంతర్గాం మండలాల్లో ఇళ్లు నిర్మించుకునే వారికి పెద్దపల్లిలో అమలు చేసిన విధంగా ఉచితంగా ఇసుక సరఫరా చేయాలి. దీంతో ఆర్థిక భారం తగ్గే అవకాశం ఉంది.

– బందారు ప్రవీణ్‌కుమార్, అంతర్గాం

ఉచితంగా ఇవ్వాలి

పెద్దపల్లిలో స్యాండ్ టాక్స్ అమలు చేయాలని మేం కోరడంలేదు. కానీ, అక్కడ అమలు చేసినట్లు మా నియోజకవర్గంలో సైతం ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని విన్నవిస్తున్నాం. దీనిద్వారా కొత్తగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టే వారికి ఆర్థిక భారం తగ్గుతుంది. జిల్లా అంతటా ఒకే ఇసుక పాలసీ ఉండాలని మాత్రమే మే కోరుతున్నాం.

– తగరం శంకర్‌లాల్, మంథని

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించండి

- అదనపు కలెక్టర్ అరుణశ్రీ



పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

కోల్‌సిటీ(రామగుండం): నగరంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అదనపు కలెక్టర్, రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్(ఎఫ్ఏసీ) అరుణశ్రీ ఆదేశించారు. నగరంలోని పలు డివిజన్లలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. 21వ డివిజన్‌లో రోడ్డు, మురుగునీటి కాలువ, వంతెన, 20వ డివిజన్‌లో రైల్వే స్టేషన్ ఎదుట షాపింగ్ కాంప్లెక్స్, ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు – ఆర్ఎఫ్‌సీఎల్ వరకు డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి రాజు, ఎస్ఈ శివానంద్, ఈఈ రామన్, డీఈ జమీల్, ఏఈ మీర్, హెల్త్ అసిస్టెంట్ సునీల్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

వీధిదీపాలు వెలిగేలా చర్యలు

నగరంలో వీధిదీపాలు వెలిగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు అరుణశ్రీ తెలిపారు. రూ.33.90 లక్షలు వెచ్చించి 20 వాట్ల 940 లైట్లు, 45 వాట్ల 215 లైట్లు, 70 వాట్ల 114 లైట్లు, 90 వాట్ల 30 లైట్లు కొనుగోలు చేసినట్లు ఆమె తెలిపారు. వీటిని 15 – 30 రోజుల్లోగా అమర్చాలని సూచించారు. నగరంలో 1219 విద్యుత్ స్తంభాలు అవసరమని అంచనా వేయగా, 677 స్తంభాలు ఇప్పటివరకు వేశామన్నారు. మిగతావి నెలలోగా బిగిస్తామని తెలిపారు. కాగా, ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తుదారులకు అరుణశ్రీ ప్రొసీడింగ్స్ అందజేశారు.

ఆస్తిపన్ను సకాలంలో చెల్లించండి

ఆస్తిపన్ను బకాయిలతో సహా సకాలంలో చెల్లించాలని అరుణశ్రీ కోరారు. మీ సేవా కేంద్రం లేదా https://cdma.cgg.gov.in/cdma&arbs/CDMA&PG/PTMenu వెబ్‌సైట్‌లో పన్ను చెల్లించాలని ఆమె సూచించారు. 90002 53342 నంబరుకు వాట్సాప్ మెసేజ్ పంపించి ఆస్తిపన్ను వివరాలు తెలుసుకునే అవకాశం ఉందని అరుణశ్రీ వివరించారు.

షాపింగ్ కాంప్లెక్స్ పనుల పరిశీలన

రామగుండం: స్థానిక రైల్వేస్టేషన్ ఎదుట చేపట్టిన షాపింగ్ కాంప్లెక్స్ పనులను ఇన్‌చార్జి కమిషనర్ అరుణశ్రీ పరిశీలించారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ శివానంద్ పనుల పురోగతిపై అదనపు కలెక్టర్‌కు వివరించారు. పనులు సత్వరమే పూర్తిచేయించాలని స్థానిక కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్ విన్నవించారు. కార్యక్రమంలో ఈఈ రామన్, డీఈ జమీల్, ఏఈ మీర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట ప్రణాళిక

- రామగుండం సీపీ శ్రీనివాస్



మాట్లాడుతున్న పోలీసు కమిషనర్ శ్రీనివాస్

గోదావరిఖని: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట ప్రణాళిక రూపొందించాలని రామగుండం పోలీస్‌కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. కమిషనరేట్ స్థాయి రోడ్డు భద్రతపై శుక్రవారం తన కార్యాలయంలో సమీక్షించారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, రవాణా, నేషనల్ హైవే అథారిటీ తదితర విభాగాల అధికారులు హాజరయ్యారు. మానవతప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. 18 – 45 ఏళ్లలోపు వారే అధికంగా ఇందులో చనిపోతున్నారని తెలిపారు. నేషనల్ హైవే 63, 363, స్టేట్ హైవే 01, 155, 24, 15 రోడ్లపై గుర్తించిన బ్లాక్ స్పాట్లు, పోలీస్, ట్రాఫిక్ తదితర శాఖల అధికారులు సందర్శించి ప్రమాదాలకు గల కారణాలు గుర్తించాలని సూచించారు. ఇదేసమయంలో పరిష్కార మార్గాలు సూచించాలన్నారు. పెద్దపల్లి డీసీపీ చేతన, అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, శ్యామ్‌లాల్, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) రాజు, జిల్లా రవాణా అధికారి రంగారావు, ఎంవీఐ శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్, గోదావరిఖని, పెద్దపల్లి, మంచిర్యాల, జైపూర్, బెల్లంపల్లి, రామగుండం ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్, సీసీఎస్, ఏఆర్ ఏసీపీలు రాఘవేంద్రరావు, రమేశ్, కృష్ణ, ప్రకాశ్, వెంకటేశ్వర్లు, రవికుమార్, నరసింహులు, మల్లారెడ్డి, వెంకటస్వామి, ప్రతాప్, సుందర్‌రావు ఉన్నారు.

గీత కార్మికులకు సర్కార్ చేయూత

- రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్



కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: గీతకార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేయూతనందిస్తోందని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని 90మంది గీతకార్మికులకు కాటమయ్య కిట్లు అందించి మాటాడారు. కిట్ల వినియోగంపై కార్మికులకు శిక్షణ ఇప్పిస్తామన్నారు. తాటిచెట్లు ఎక్కే సమయంలో ప్రమాదాలకు గురికాకుండా ఇవి ఉపయోగపడతాయన్నారు. పదేళ్లలో గీత కార్మికుల ప్రమాదాలు, మరణాలు గణనీయంగా పెరిగాయని, కల్లు తీసే సమయంలో మోకులముడి ఊడిపోవటం, చెట్లు ఎక్కేటప్పుడు జారటంతో కార్మికులు కిందపడి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. గత పదేళ్లలో రాష్ట్రంలో 775 మంది గీత కార్మికులు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. దాదాపు 2 వేల మంది శాశ్వతంగా వైకల్యం పొందారని వెల్లడించారు. ఈప్రమాదాలను నివారించేందుకు ప్రభుత్వం కిట్లను అందజేస్తోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గీత కార్మికులను పట్టించుకున్న పాపానపోలేదని ఆయన విమర్శించారు. గీతకార్మికులతోపాటు కాంగ్రెస్ నాయకులు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, తిప్పారపు శ్రీనివాస్, ముస్తాఫా పాల్గొన్నారు.

కోతల్లేకుండా ధాన్యం కొనుగోళ్లు

- ఎమ్మెల్యే విజయరమణారావు



కొనుగోళ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయ్

ఎలిగేడు/ఓదెల/కాల్వశ్రీరాంపూర్/సుల్తానాబాద్/జూలపల్లి(పెద్దపల్లి): ఆరుగాలం శ్రమించి రైతులు పండించిన ధాన్యంలో ఎలాంటి కోతల్లేకుండా మద్దతు ధరతోనే కొనుగోలు చేస్తున్నామని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. ఎలిగేడు, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, జూలపల్లి మండలాల్లో శుక్రవారం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. కాల్వశ్రీరాంపూర్ మండలంలో వివిధ అభివృద్ధి పనుల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో తాలు, తరుగు, మట్టి, తేమ పేరిట పేరిట ధాన్యంలో అడ్డగోలుగా కోతలు విధించి రైతులను అందినకాడికి దోచుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చాక కోతలకు చెక్ పెట్టామని తెలిపారు. రైస్‌మిల్లర్లకు తక్షణమే ట్రాక్‌షీట్, రైతులకు రసీదు ఇవ్వాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఆయన సూచించారు. సన్నరకం వడ్లు విక్రయించిన రైతులకు క్వింటాలుపై రూ.500 బోనస్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో జరిగి ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జీడీకే–5 ఓసీపీలో అత్యధిక బొగ్గు ఉత్పత్తి



విజయకేతనం చూపిస్తున్న ఉద్యోగులు

గోదావరిఖని: సమష్టిగా పనిచేసి ఒక్కరోజు రికార్డు స్థాయి బొగ్గు ఉత్పత్తి సాధించారు జీడీకే–5 ఓసీపీ ఉద్యోగులు. సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1లోని జీడీకే–5 ఓసీపీలో శుక్రవారం ఈ రికార్డు నెలకొల్పారు. ఒకరోజు 11,290 టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి 17,394 టన్నులు ఉత్పత్తి చేసి లక్ష్యాన్ని మించి 154శాతం సాధించారు. ఈఏడాది ఇప్పటివరకు ఓసీపీ 18.05లక్షల టన్నులకు 17.94 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించి 95 శాతంలో నిలిచింది. ఈఆర్థిక సంవత్సరంలో ఒక్కరోజులో రికార్డు స్థాయి బొగ్గు ఉత్పత్తి సాధించడం ఇదే తొలిసారి. ఉద్యోగులను ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

1న బీసీ కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ

పెద్దపల్లిరూరల్: స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం కల్పించే విషయమై బీసీ వర్గాల నుంచి ప్రజాభిప్రాయ సేకరణను నవంబర్ 1వ తేదీన కరీంనగర్ కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు, మేధావులు హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించాలని సూచించారు. స్థానిక సంస్థల్లో వెనుకబాటుతనం తదితర అంశాలపై ప్రజాభిప్రాయ సేకరణకు ప్రభుత్వం ప్రత్యేక బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. నవంబర్ 1న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజల అభిప్రాయాలను కమిషన్ తెలుసుకుంటుందని పేర్కొన్నారు.

నేడు ఆయుష్ తుది మెరిట్ జాబితా

పెద్దపల్లిరూరల్: జాతీయ ఆరోగ్యమిషన్ కింద ఆయుష్‌లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చేపట్టిన చర్యల్లో భాగంగా తుది మెరిట్ జాబితాను కార్యాలయ నోటీస్ బోర్డుపై అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ సూచించారు. ఆయుష్ వైద్యాధికారి–01, ఫార్మసిస్ట్–06, స్వీపర్ కమ్ నర్సింగ్ ఆర్డర్లీ–02 పోస్టుల ఫైనల్ జాబితాను శనివారం ఉదయం 11.00 గంటల నుంచి డీఎంహెచ్‌వో కార్యాలయ నోటీస్ బోర్డుపై, జిల్లా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని ఆయన వివరించారు. ఈనెల 28వ తేదీ సాయంత్రం 05.00 గంటల్లోగా అభ్యంతరాలను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

ఆపరేషన్ 'నియంత్రణ'

- శునకాలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స
- జిల్లావ్యాప్తంగా 10 మందితో ప్రత్యేక బృందం నియామకం
- మల్కాపూర్‌లో ప్రత్యేక ఆపరేషన్ థియేటర్, బోన్లు

కోల్‌సిటీ(రామగుండం): జిల్లాలో వీధికుక్కల సంతానోత్పత్తి నియంత్రణకు శ్రీకారం చుట్టారు. వాటిని గుర్తించి యాంటీ రేబిస్ టీకాలు వేయడంతోపాటు, సంతానోత్పత్తి నివారణకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నారు. ఇందుకోసం రామగుండం నగరపాలక సంస్థ పరిధి మల్కాపూర్ శివారులోని స్లాటర్‌హౌస్‌లో యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) ఏర్పాటు చేశారు. రామగుండం నగరంతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నాలుగు రోజులుగా ప్రత్యేక సిబ్బంది పట్టుకుంటున్న కుక్కలను ఇక్కడకు తరలించి ఆపరేషన్లు చేస్తున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలు, యానిమల్ బర్త్ కంట్రోల్ రూల్స్ –2023 ప్రకారం చర్యలు తీసుకుంటున్నారు.

హైదరాబాద్ సంస్థకు బాధ్యతలు..

- వీధి కుక్కల సంతానోత్పత్తి నియంత్రణకు హైదరాబాద్‌లోని యానిమల్ వెల్ఫేర్ సొసైటీకి బాధ్యతలు అప్పగించారు. ఈ సంస్థ 10 మందితో కూడిన ప్రత్యేక బృందాన్ని నియమించింది. వీరు శునకాలను పట్టుకుని ఆపరేషన్లు చేస్తున్నారు. ఇందులో ఒక వెటర్నరీ డాక్టర్, ఇద్దరు అసిస్టెంట్లు, ప్రత్యేక సిబ్బంది ఉన్నారు. తొలుత రామగుండం నగరంలోని వీధికుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేస్తూ, యాంటీ రేబిస్ టీకాలు వేస్తున్నారు. ఒక్కో శునకానికి రూ.1,650 చొప్పున బిల్లులు చెల్లించడానికి బల్దియా ఆ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. 2020లో ఇదే సంస్థ వీధికుక్కల సంతానోత్పత్తి నియంత్రణకు ఒప్పందం కుదుర్చుకుని, ఆపరేషన్లు నిర్వహించింది.

జిల్లాలో 25 వేలకుపైగా వీధికుక్కలు..

- పచ్చదనం–స్వచ్ఛదనం ద్వారా జిల్లాలో సుమారు 25 వేలకుపైగా వీధి కుక్కలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. రామగుండం బల్దియాలో 4 వేలకుపైగా ఉన్నట్లు తెలిపారు. తొలుత రామగుండంలోని 50 డివిజన్ల నుంచి వీధికుక్కలను పట్టుకొని, ఏబీసీకి తరలించి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు పూర్తిచేస్తారు. ఆ తర్వాత, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలు, మండల కేంద్రాలు, గ్రామాల్లోంచి పట్టుకొచ్చి కు.ని. ఆపరేషన్లు చేసేలా కార్యాచరణ రూపొందించారు.



ఆపరేషన్ చేసిన కుక్క చెవుకు 'వి' గుర్తు

బరువు, ఆరోగ్య సమస్యలపై ఆరా

- డివిజన్లలోంచి సిబ్బంది పట్టుకొచ్చిన వీధికుక్కల బరువుతోపాటు ఆరోగ్య సమస్యలను వెటర్నరీ డాక్టర్ పరీక్షిస్తున్నారు. ఆ తర్వాతే యాంటీ బయాటిక్ ఇంజక్షన్లు ఇస్తున్నారు. మత్తు మందు ఇచ్చాక కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేస్తున్నారు. తర్వాత రేబిస్ సోకకుండా యాంటీ రేబిస్ టీకా వేస్తున్నారు. మూడు రోజులపాటు వాటి ఆరోగ్యాన్ని పర్యవేక్షణ చేస్తున్నారు. ఆపరేషన్ చేసిన వాటిని గుర్తించడానికి ఎడమ చెవ్వు చివరన 'వి' ఆకారంలో కత్తిరిస్తున్నారు. తీసుకొచ్చిన ప్రాంతాల్లోనే మళ్లీ కుక్కలను వదిలేస్తున్నారు.



కుక్కకు ఆపరేషన్ చేస్తున్న వెటర్నరీ డాక్టర్

శస్త్రచికిత్సకు ప్రత్యేక బృందాలు



వీధికుక్కల సంతానోత్పత్తి నియంత్రణకు 10 మందితో కూడిన ప్రత్యేక టీంను ఏర్పాటు చేశాం. జిల్లావ్యాప్తంగా పట్టుకున్న వీధికుక్కలకు రామగుండం నగరంలోని థియేటర్‌లోనే ఆపరేషన్లు చేయాలని ఉన్నతాధికారులు సూచించారు. ఈమేరకు ప్రణాళిక ప్రకారం శస్త్రచికిత్స చేస్తున్నాం. పెరుగుతున్న కాంక్రీట్ జంగిల్‌తో వీధికుక్కలకు ఆహారం, నీళ్లు అందడంలేదు. దీనికితోడు కుక్కల సంతతి బాగా పెరిగింది. అందుకే ప్రజలపై దాడులు చేస్తున్నాయి. యాంటీ రేబిస్ టీకాలు వేయడంతో అవి కరిచినా పెద్దగా ప్రమాదం ఉండదు.

– డాక్టర్ కె.శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ, యానిమల్ వెల్ఫేర్ సొసైటీ, హైదరాబాద్

స్పెషల్ డ్రైవ్ చేపట్టాం



రామగుండం నగరంలో వీధికుక్కల సంతానోత్పత్తి నియంత్రణకు ప్రతీరోజు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఇందుకోసం ప్రణాళిక ప్రకారం డివిజన్లను ఎంచుకుంటున్నాం. వీటికోసం మల్కాపూర్ శివారులో ప్రత్యేకంగా ఏబీసీ ఏర్పాటు చేశాం. ఆపరేషన్ థియేటర్‌తోపాటు సౌకర్యాలు కల్పించాం. వీధి కుక్కలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశాం. ఈ బృందం ప్రతీరోజూ కుక్కలను పట్టుకొని ఏబీసీకి తరలిస్తోంది. అక్కడ ఆపరేషన్లు చేయించి టీకాలు వేయిస్తున్నాం.

– జె.అరుణశ్రీ, బల్దియా కమిషనర్, రామగుండం

క్లుప్తంగా

నిరుపేద విద్యార్థులకు ఫీజుల్లో రాయితీ

- అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి



కరీంనగర్: తన విద్యాసంస్థల్లో నిరుపేద విద్యార్థులకు ఫీజుల్లో రాయితీ, వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం కరీంనగర్ మండలంలోని పలు విద్యాసంస్థల్లో ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. పట్టభద్రుల ఎన్నికల్లో తనకు మద్దతు తెలపాలని కోరారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు విద్యారంగ సమస్యలపై అవగాహన ఉన్న తనను పట్టభద్రులు ,ఉపాధ్యాయులు నిరుద్యోగులు భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నవంబర్ 6లోపు ప్రతీఒక్కరు ఓటును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. తనకు అవకాశం ఇస్తే నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు పారమిత విద్యార్థి



కరీంనగర్: నగరంలోని పారమిత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న భువన కృతి రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్ పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజీ తెలిపారు. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి సెమినార్‌లో భువనకృతి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రొటెన్షియల్స్ అండ్ కన్సరన్స్ అంశంపై ఇచ్చిన సెమినార్ మొదటిస్థానం సాధించింది. ఈనెల 29న రాష్ట్రీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థవారి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికైంది. విద్యార్థిని పారమిత పాఠశాల అధినేత ఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, రాకేశ్, రశ్మిత, అనుకర్ రావు అభినందించారు.

29న హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

కరీంనగర్‌స్పోర్ట్స్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29న అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్స్ (ఏహెచ్‌పీఎస్) కొత్తపల్లి (హ)లో ఉమ్మడి జిల్లాస్థాయి సబ్ జూనియర్స్ గర్ల్స్ టోర్నమెంట్ కమ్ సెలెక్షన్స్ ట్రైల్స్ నిర్వహించడం జరుగుతుందని ఉమ్మడి కరీంనగర్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బాసరవేణి లక్ష్మణ్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెల 02నుంచి 04వరకు ఆసిఫాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనడం జరుగుతుందన్నారు. ఈ ఎంపిక పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌కార్డులు, డేట్‌ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ తీసుకొని ఉదయం 10 గంటలకు సంయుక్త కార్యదర్శి ఎస్. ప్రభాకర్, హ్యాండ్‌బాల్ కోచ్ మూల వెంకటేశ్, అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ పీఈటీ శ్రీధర్ కు రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. వివరాలకు 9441925807, 8978995730, 9550942180 నంబర్లను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

నకిలీ పాసుపుస్తకాలతో కాజేశారు

- రామగిరి పోస్టాఫీసులో ఘరానా మోసం
- లబోదిబోమంటూ రోడ్డెక్కిన ఖాతాదారులు



ఈచిత్రంలో కనిపిస్తున్న వాళ్లందరూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారే. కష్టపడితేనే పూగడిచేది. తాము చేస్తున్న కష్టం తమ పిల్లలు పడకూడదనే భావనతో భవిష్యత్ అవసరాలు తీర్చుకోవడానికి పోస్టాఫీస్ పథకాల్లో పొదుపు చేస్తున్నారు. వీరి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న పోస్టల్ సిబ్బంది నకిలీ పాస్‌పుస్తకాలు తయారు చేసి పొదుపు ఖాతాల్లోని డబ్బు స్వాహా చేశారు. ఈ సంఘటన రామగిరి మండలం బేగంపేట పోస్టాఫీస్‌లో చోటుచేసుకుంది. బాధితులు శుక్రవారం పోస్టాఫీస్ ఎదుట నిరసన తెలిపారు.



అధికారులు గుర్తించిన నకిలీ పాస్‌బుక్కులు

సాక్షి, పెద్దపల్లి: పోస్టాఫీసు అంటే నమ్మకానికి చిరునామా. ఏ ఉత్తరం వచ్చినా భద్రంగా అందించి విశ్వసనీయత చాటుకునే వ్యవస్థ. ఆధునిక పరిస్థితుల నేపథ్యంలో ఉత్తరాల పాత్ర అంతగా లేదు. దీంతో పోస్టాఫీసులు బ్యాంకింగ్ రంగంలోకి అడుగు పెట్టాయి. ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు (ఐపీపీబీ) పేరుతో పల్లెల్లో లావాదేవీలు జరుపుతోంది. బ్యాంకుల మాదిరిగా అన్ని నగదు లావాదేవీలు చేపడుతోంది. ఈ వ్యవహారంపై పర్యవేక్షణ, జవాబుదారీతనం లేక రామగిరి మండలం బేగంపేట పోస్టాఫీస్‌లో సిబ్బంది చేతివాటం ప్రదర్శించారు. తద్వారా బడా మోసం బయటపడింది. ఈ పోస్టాఫీసు పరిధిలో దాదాపు పదుల సంఖ్యలోని ఖాతాదారుల నుంచి సుమారు రూ.అర కోటి వరకు గోల్‌మాల్ జరిగినట్లు సమాచారం. డిపాజిట్లు, ఆర్డీల నగదును నకిలీ పాసుపుస్తకాలతో పక్కదారి పట్టించినట్లు విశ్వసనీయ సమాచారం.

బయటపడిందిలా..

బేగంపేట పోస్టాఫీస్‌కు చెందిన ఓ మహిళ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పోస్టాఫీస్‌లో ఖాతాలు తెరిచేందుకు వచ్చిన నిరాక్షరాస్యులను గుర్తించి, వారికి నకిలీ పాస్‌పుస్తకాలు అంటగట్టారు. వారి ఖాతాల్లో జమచేసిన నగదును తన సొంత అవసరాలకు వినియోగించుకున్నట్లు సమాచారం. ఇటీవల బదిలీపై వచ్చిన సబ్ పోస్ట్ మాస్టర్ శివకుమార్ పలు ఖాతాలపై అనుమానం వచ్చి తనిఖీ చేయగా విషయం మోసం బయటపడింది. దీంతో కొంతమంది ఖాతాదారులను పిలిపించి వారి పాసుపుస్తకాలు పరిశీలించగా నకిలీవిగా తేలింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించామని ఎస్‌పీఎం శివకుమార్ 'సాక్షి'కి తెలిపారు.

రెండు లక్షలు పోయాయి



మా బిడ్డ గుండ శ్రీవర్ష పేరుతో బేగంపేట పోస్టాఫీస్‌లో 2015లో ఖాతా ఓపెన్ చేశా. సుకన్య సమృద్ధి యోజన పథకం కింద అప్పటి నుంచి లావాదేవీలు కొనసాగిస్తున్న. ఇప్పటివరకు దాదాపు రూ.13,83,589 జమచేశాం. ఈరోజు పోస్టాఫీస్‌కు పోయి నిల్వ చూసుకోగా కేవలం రూ.11,60,000 మాత్రమే ఉన్నాయి. సుమారు రూ.2లక్షలు దాకా పోయాయి. మాలాంటి వారు పదుల సంఖ్యలో ఉన్నారు. – గుండ శ్రీనివాస్, బేగంపేట

రాజన్న హుండీ లెక్కింపులో చేతివాటం

- నగదు తీసుకెళ్లే యత్నం చేస్తూ పట్టుబడిన కాంట్రాక్ట్ ఉద్యోగి
- సదరు ఉద్యోగిని విధుల్లో నుంచి తొలగించిన అధికారులు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

వేములవాడఅర్బన్: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ రాజన్న ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. హుండీలో నగదు, బంగారం, వెండి కానుకలు వేసి మొక్కులు చెల్లించుకుంటారు. సంవత్సరానికి హుండీ ఆదాయం రూ.30 కోట్లు వస్తోంది. అయితే హుండీల ఆదాయం లెక్కింపును భద్రత నడుమ లెక్కిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలుపుతున్నా గురువారం జరిగిన లెక్కింపులో కాంట్రాక్ట్ ఉద్యోగి నగదు తీసుకెళ్లే ప్రయత్నాన్ని ఆలయ భద్రత సిబ్బంది గుర్తించి పట్టుకున్నారు.

నగదు కాజేసే ప్రయత్నం

ఆలయంలో గురువారం హుండీ ఆదాయం లెక్కింపు సమయంలో కాంట్రాక్ట్ ఉద్యోగ ఒకరు నగదు కాజేసే యత్నం చేశారు. ఉద్యోగి తీసుకొచ్చిన సంచిలో రూ.500 నోట్ల కట్టలు రెండు, విదేశీ కరెన్సీ కట్ట ఉంచి గుట్టు చప్పుడు కాకుండా తరలించేందుకు యత్నించడంతో ఎస్పీఎఫ్ భద్రతా సిబ్బందికి అనుమానం వచ్చి తనిఖీ చేసి పట్టుకున్నారు. దీంతో ఆ ఉద్యోగిని విధుల్లో నుంచి తొలగించారు. అయితే హుండీ లెక్కింపు సమయంలో సీసీ కెమెరాలు, ఎస్పీఎఫ్ భద్రత సిబ్బంది ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నా నగదు తీసుకెళ్లే యత్నం చేయడం అనుమానాలకు తావిస్తోందని పలువురు అంటున్నారు.

గతంలో కూడా..

రాజన్న ఆలయంలో 2019లో హుండీ లెక్కింపులో ఓ వ్యక్తి సుమారుగా 20 కిలోల సంచిలో నగదు పట్టుకెళ్లారు. హుండీ లెక్కింపు తర్వాత కోడెల క్యూ కాంప్లెక్స్‌లో బియ్యం కోసం వచ్చిన వ్యక్తి ఖాళీ సంచులు గ్రీన్ మ్యాట్ కింద సంచి కోసం వెతికిన క్రమంలో స్వామివారి కానుకల సంచి దొరికింది. ఆ కానుకల సంచిని తీసుకువెళ్లిన వ్యక్తి కరీంనగర్‌లో విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడటంతో హుండీ లెక్కింపులో ఓపెన్ స్లాబ్‌లో తనకు సంచి దొరికినట్లు పోలీసులకు చెప్పారు. ఈ వ్యవహారంలో అతడు జైలుకు వెళ్లారు.

విధుల్లో నుంచి తొలగించాం

రాజన్న ఆలయ హుండీ లెక్కింపులో కాంట్రాక్ట్ ఉద్యోగి అనుమానాస్పదంగా నగదు తీసుకువెళ్లేందుకు ప్రయత్నించగా అక్కడి ఎస్పీఎఫ్ సిబ్బంది పట్టుకున్నారు. అతడిని వెంటనే విధుల్లో నుంచి తొలగించాం. ఒక్క రూపాయి కూడా బయటకు వెళ్లలేదు..

– వినోద్‌రెడ్డి, రాజన్న ఆలయ ఈవో

దొంగలు బాబోయ్ దొంగలు!

- వరుస చోరీలతో ఆందోళన చెందుతున్న జనం

గంభీరావుపేట(సిరిసిల్ల): ఇంటికి తాళం వేస్తే..అంతే సంగతులు. తాళాలు పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు ఇల్లు గుల్ల చేస్తున్నారు. గంభీరావుపేట మండలంలో వరుసగా జరుగుతున్న దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇంటికి తాళం వేసి ఊరెళ్లాలంటేనే జంకుతున్నారు. దొంగతనాలు పోలీసులకు సవాల్‌గా మారాయి. కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. సీసీ కెమెరాలకు చిక్కకుండా మరీ దొంగతనాలకు పాల్పడుతున్నారు. అక్కడక్కడా సీసీ కెమెరాల్లో దొంగలు కనిపించిన ఆనవాళ్లు స్పష్టంగా లేకపోవడంతో పోలీసులకు చిక్కడం లేదు. తాళం వేసిన ఇళ్లనే కాకుండా ఆలయాలను సైతం వదలడం లేదు. నగదు, బంగారు అభరణాల కోసం ఇళ్లంతా చిందరవందర చేస్తున్నారు. పోలీసులు దొంగతనాల నియంత్రణకు పకడ్బందీ గస్తీలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దొంగతనాలు ఇలా..

- రెండు రోజుల క్రితం మల్లారెడ్డిపేటలో తాళం వేసి ఉన్న రెండిళ్లలో చోరీ జరిగింది.
- ముస్తాఫానగర్‌కు చెందిన నారాయణరావు వ్యక్తి ఇంట్లో దొంగతనం జరిగింది. కారు సైతం ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించారు.
- గంభీరావుపేటలో నాలుగైదు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. అదేవిధంగా ఎల్లమ్మ, మహంకాళమ్మ ఆలయాల్లోనూ హుండీ డబ్బులు ఎత్తుకెళ్లారు. ఆలయంలోని సీసీ కెమెరాలకు సంబంధించిన బాక్స్ పగులగొట్టి ఫుటేజీని సైతం ఎత్తుకెళ్లారు.
- లింగన్నపేటలోని వైన్స్ షాప్‌లో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు.



దొంగలు ధ్వంసం చేసిన సీసీ ఫుటేజీ బాక్స్(ఫైల్)

ప్రత్యేక బృందాలతో పెట్రోలింగ్



వరుసగా దొంగతనాలపై ప్రత్యేక నిఘా పెట్టాం. గ్రామాల్లో పెట్రోలింగ్ చేస్తున్నాం. పోలీసులతో పాటు ఐదు ప్రత్యేక బృందాలు తిరుగుతున్నాయి. త్వరలోనే దొంగతనాలను నియంత్రిస్తాం. ఊళ్లకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలి. ప్రజలు తమ కాలనీలు, దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

– శివకుమార్, గంభీరావుపేట ఎస్సై

ఎదురెదురుగా బైక్‌లు ఢీకొని ఇద్దరు మృతి



ప్రమాద స్థలం



శ్రీనివాస్(ఫైల్)



స్వామి(ఫైల్)

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): మెట్‌పల్లి మండలం వెల్లుల శివారులో శుక్రవారం ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని మండలంలోని బండలింగాపూర్‌కు చెందిన పోతుగంటి శ్రీనివాస్‌గౌడ్(50), వెల్లులకు చెందిన దగ్గుల స్వామి(42) మృతిచెందారు. పోలీసుల వివరాలు.. గీత కార్మికుడైన శ్రీనివాస్ తన అక్క కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై ఓ ఫంక్షన్‌కు వెళ్లాడు. మధ్యాహ్నం తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఇదే సమయంలో వెల్లుల వైపు నుంచి మెట్‌పల్లిలో నివాసం ఉంటున్న మత్స్యకారుడు స్వామి ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో అతివేగంగా వచ్చిన వాహనాలు ఎల్లమ్మ ఆలయ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈప్రమాదంలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందగా, స్వామి ఆసుపత్రికి తరలిస్తుండగా చనిపోయాడు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాలను మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

జగిత్యాలలో ఒకరు..

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన ఏనుగు మనోజ్‌కుమార్ (63) రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై చికిత్స పొందుతూ మృతిచెందాడు. శుక్రవారం ఉదయం మనోజ్‌కుమార్ ద్విచక్ర వాహనంపై గొల్లపల్లి రోడ్‌లో వెళ్తుండగా తుమ్మనపల్లి ప్రవీణ్ బైక్‌పై అతివేగంగా వచ్చి ఢీకొట్టాడు. మనోజ్‌కుమార్‌కు తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి మామ గన్నమనేని కరుణాకర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై మన్మదరావు తెలిపారు.

అక్రమ పట్టాలపై విచారణ

చందుర్తి(వేములవాడ): అక్రమ పట్టాలపై రెవెన్యూ అధికారులు విచారణ చర్యలు చేపట్టారు. అక్రమాలకు పాల్పడ్డ అధికారులపై చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ ఉన్నతాధికారులు చేష్టలుడిగి చూస్తున్నారన్న ఆరోపణలు మండల కేంద్రంలో జోరుగా వినవస్తున్నాయి. తప్పుడు పట్టాలు చేసిన అధికారులను గుర్తించి చర్యలు చేపట్టాల్సిన అధికార యంత్రాంగం కిందిస్థాయి అధికారులను కాపాడుకునేందుకు దిద్దుబాటు చర్యలు చేపట్టారన్న ఆరోపణలున్నాయి. అక్రమ పట్టాల్లో ఒక్క తహసీల్దార్ నరేశ్ కాకుండా.. ఇతర అధికారులు కూడా ఉన్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

ఉన్నతాధికారులు రంగంలోకి దిగితేనే..

అక్రమ పట్టాలపై జిల్లా ఉన్నతాధికారులు రంగంలోకి దిగి విచారణ చేపడితే ఎవరు అక్రమాలకు పాల్పడ్డారో బయట పడుతుంది. అక్రమ రిజిస్ట్రేషన్ చేశాడన్న ఫిర్యాదు మేరకు తహసీల్దార్ నరేశ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించగానే.. మండలంలోని అన్ని అక్రమాలన్నింటికీ అతనే బాధ్యుడన్న కోణంలో చూసే ఉన్నతాధికారులు, ప్రస్తుతం ఉన్న అధికారులు కూడా పైరవీకారులను ఏర్పాటు చేసుకొని మరికొన్ని అక్రమాలకు పాల్పడ్డారన్న ఆధారాలు ప్రజలు బయట పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.

సర్వేయర్, ఆర్ఐ విచారణ

బండపల్లి గ్రామ శివారులోని 591 సర్వే నంబర్‌లో 2.37 ఎకరాల వ్యవసాయ భూమిని గతంలో ఉన్న తహసీల్దార్ అక్రమ పట్టా చేశారన్న ఆరోపణలుండగా.. అదే సమయంలో ఆ భూమి గ్రామ కంఠంగా తప్పుడు నమోదు చేశారు. గ్రామ కంఠంను తొలగించేందుకు పట్టాదారుడు మీసేవలో దరఖాస్తు చేసుకోగా.. ప్రస్తుతం ఉన్న తహసీల్దార్ గ్రామ కంఠాన్ని తొలగించేందుకు ఆర్డీవోకు నివేదిక పంపించారు. ఆర్డీవో వద్ద పెండింగ్ ఉన్న సమయంలోనే అక్రమాల విషయం బయట పడడంతో.. అక్కడికే నిలిపివేశారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. శుక్రవారం డిప్యూటీ సర్వేయర్ చామంతి, ఆర్ఐ శ్రీనివాస్ విచారణ చేపట్టారు.

చర్యలు తీసుకుంటాం



అక్రమ పట్టాలపై సమగ్ర విచారణ చేపడుతున్నాం. పట్టాలు ఎలా చేశారు.. ఎవరు చేశారన్న విచారణ పూర్తి చేస్తే కానీ అసలు విషయాలు బయటపడేలా లేవు. విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తాం. చర్యలు తీసుకోవడం, దిద్దుబాటు చర్యలు చేపట్టడం ఉన్నతాధికారుల చేతుల్లో ఉంది.

– సీహెచ్ శ్రీనివాస్, తహసీల్దార్, చందుర్తి

ప్రాణం తీసిన అతివేగం

- రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం



వంశీ(ఫైల్)

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): స్థానిక గౌతమినగర్ ప్రధాన రహదారిపై మాతంగికాలనీలో గురువారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పి గోదావరిఖని రమేశ్‌నగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సిరిపురం వంశీ(27) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి మాదాసు సాయినితీశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. వంశీ, సాయినితీశ్ ఎన్టీపీసీ నుంచి తిలక్‌నగర్‌కు వంశీ ద్విచక్ర వాహనం పై బయలు దేరారు. వాహనం అతివేగంగా ఉండడంతో మాతంగికాలనీలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్ వద్దకు రాగానే అదుపుతప్పి కింద పడింది. ఈ ఘటనలో బైక్ వెనకాల కూర్చున్న వంశీ రోడ్డుపై పడడంతో తలకు తీవ్రగాయాలై మృతి చెందాడు. సాయినితీశ్‌కు తీవ్రగాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి సిరిపురం శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఎస్సై సతీశ్ కేసు నమోదు చేసుకొన్నారు.

రెండు రోజుల్లో కొత్త కంపెనీలో చేరాల్సిన వంశీ..

వంశీ తండ్రి సింగరేణి ఓసీపీ–3లో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్నాడు. తల్లి మమత. స్థానిక తిరుమలనగర్‌లో ఇద్దరు కుమారులతో నివాసం ఉంటున్నారు. పెద్ద కుమారుడు వంశీ హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ప్యాకేజీ అధికంగా ఇచ్చే మరో కంపెనీలో ఇటీవల ఉద్యోగం వచ్చింది. రెండురోజుల్లో అందులో చేరాల్సి ఉంది. ఈ క్రమంలో ఫ్రెండ్స్‌ను కలుసుకోవడానికి బయటకు వెళ్లిన వంశీ అనూహ్యంగా రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో తల్లిదండ్రులు, సోదరుడు సూర్య గుండెలవిసేలా రోదిచారు. మరోవైపు.. కొడుకును కోల్పోయిన పుట్టెడు దుఃఖంలోనూ తమ కుమారుడి కళ్లను దానం చేసి తల్లిదండ్రులు మరో ఇద్దరికి చూపునిచ్చారు.

ముగిసిన ఉమ్మడి జిల్లాస్థాయి క్రీడా పోటీలు

- ఇష్టంతో సాధన చేస్తే గెలుపు కష్టం కాదు
- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



విజేతలతో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్(మానకొండూర్): ఇష్టంతో సాధన చేస్తే గెలుపు కష్టం కాదని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహించిన 2024–25 జిల్లా స్థాయి క్రీడా పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పోటీల్లో విజేతలు సంతోషపడటం సహజమేనని, ఓడినవారు కుంగిపోకుండా సాధనచేస్తూ గెలుపు సాధ్యమని, ఆడబోయే క్రీడల్లో విజయాలు సాధించేందుకు క్రీడోత్సవాలు పునాది కావాలన్నారు. జట్టుగా ఆడే ఆటల్లో సామూహిక ప్రతిభ ప్రదర్శించాల్సి ఉంటుందని, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకునే క్రీడలపై విద్యార్థులు ఆసక్తికనబర్చాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందని.. ఇందులో భాగంగానే స్పోర్ట్స్ స్కూళ్లను ప్రారంభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంజెపి ఆర్సివో అంజలి కుమారి ప్రిన్సిపాల్ సరిత పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని మూడిళ్లలో చోరీ

కరీంనగర్‌క్రైం: నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో మూడిళ్లలో చోరీ జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. టూటౌన్ పరిధిలోని టెలిఫోన్ క్వార్టర్స్ రోడ్డు నంబర్–1లో ఉంటున్న జె.రఘునందన్‌రావు వారం క్రితం కుటుంబంతో కలిసి అమెరికాలో ఉంటున్న కూతురు వద్దకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం ఇంటి తలుపు తెరిచి ఉండడంతో పక్కింటివారు ఆయనకు సమాచారం ఇచ్చారు. సమీపంలోనే నివాసం ఉంటున్న రఘునందన్‌రావు సోదరి వచ్చి పరిశీలించగా.. చోరీ జరిగినట్లు గుర్తించింది. అర్ధరాత్రి ఓ యువకుడు మాస్కు ధరించి దొంగతనం చేయడం సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. ఇంట్లో ఉన్న 2తులాల బంగారం, వెండి వస్తువులు, విలువైన వాచ్, ట్యాబ్‌లు తస్కరణకు గురయ్యాయని రఘునందన్‌రావు బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాంనగర్‌లోని రోడ్డు నంబర్8లో నివాసం ఉంటున్న కూర కిషన్ స్టాంప్ వెండర్‌గా ఉపాధి పొందుతున్నాడు. గురువారం రాత్రి నగరంలో ఉండే కుమార్తె ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లో ఉన్న రూ.20 వేలవిలువైన స్టాంప్‌పేపర్లు, రూ.50వేల నగదు చోరీకి గురైనట్లు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వన్‌టౌన్ పరిధిలోని వినాయకనగర్ రోడ్డు నంబర్–4లో నివాసం ఉంటున్న కాట రమేశ్ సోదరుడు మృతి చెందడంతో మానకొండూర్ మండలం కెల్లెడకు వెళ్లాడు. శుక్రవారం మధ్యాహ్నం వచ్చి బీరువా తెరిచి ఉండడంతో పరిశీలించగా.. 4.5తులాల బంగారం, 10తులాల వెండి వస్తువలు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేయడంతో సీఐ కోటేశ్వర్ కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



వినయ్(ఫైల్)

పెద్దపల్లిరూరల్: రాఘవాపూర్ గ్రామానికి చెందిన గుండ వినయ్(25) శుక్రవారం విద్యుదాఘాతానికి గురై మరణించాడు. రాఘవాపూర్ శివారులోని ఇటుకబట్టీ వద్ద ఓ దుకాణం ఏర్పాటు చేసేందుకు వినయ్ యత్నిస్తున్నాడు. ఈక్రమంలో ఇటుక బట్టీ నుంచి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు ఇనుప నిచ్చెన సాయంతో స్తంభంపైకి ఎక్కుతున్నాడు. ఈక్రమంలో ప్రమాదానికి గురై మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ పనులు చేసే ఎలక్ట్రీషియన్ సహాయకుడిగా తీసుకెళ్లడంతోనే వినయ్ విద్యుదాఘాతానికి గురయ్యాడని మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. ఇటుకబట్టీల సమీపంలో ప్రధాన రహదారి వెంట టేలాలు, గుడారాలు వేసి వలస కూలీలకోసం దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారని, ఇలాంటి వారికోసం ఇటుక బట్టీల నుంచి అక్రమంగా విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.

ఆన్‌లైన్ మోసం.. ఇద్దరి అరెస్టు

- రూ.33.63 లక్షలు టోకరా వేసిన నిందితులు

కరీంనగర్‌క్రైం: ఆన్‌లైన్ పెట్టుబడుల పేరుతో కరీంనగర్ జ్యోతినగర్‌కు చెందిన వ్యక్తిని మోసం చేసిన ఇద్దరు నిందితులను అహ్మదాబాద్‌లో అరెస్టు చేసిన కరీంనగర్ సైబర్‌క్రైం పోలీసులు శుక్రవారం స్థానిక కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు. వారి వివరాల ప్రకారం.. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన అహ్మద్‌ఖాన్, సర్ఖేజ్‌కు చెందిన షేక్ అఫ్తాబ్(24), దివాన్ మురద్‌షా(34)కలిసి ముఠాగా ఏర్పడ్డారు. మిగితా ఇద్దరిపై అహ్మదాబాద్ భోపాల్‌లోని ఇండస్ ఇండ్ బ్యాంక్‌లో ఖాతాలు తెరిపించి అహ్మద్‌ఖాన్ వాటిని నిర్వహిస్తున్నాడు. కరీంనగర్‌లోని జ్యోతినగర్‌కు చెందిన పచ్చునూరి సురేందర్ సెల్‌ఫోన్‌కు వాట్సాప్, టెలిగ్రాంలో అహ్మద్‌ఖాన్ సందేశాలు పంపించాడు. బంగారం, ఎక్స్ఆర్‌పీలో పెట్టుబడిపెడితే లాభాలుంటాయని నమ్మించాడు. దీంతో బాధితుడు రూ.33,63,000 అహ్మద్‌ఖాన్‌కు బదిలీ చేశాడు. అప్పటి నుంచి స్పందన లేకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు కరీంనగర్ సైబర్‌క్రైం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితులైన షేక్‌అఫ్తాబ్, దివాన్ మురాద్‌షాను అహ్మదాబాద్‌లో బుధవారం అరెస్టు చేశారు. అక్కడి కోర్టులో ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తీసుకొచ్చి శుక్రవారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్ చేశారు. త్వరలోనే ప్రధాన నిందితుడు అహ్మద్‌ఖాన్‌ను అరెస్టు చేస్తామని సైబర్‌క్రైం స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఏసీపీ నరసింహారెడ్డి వెల్లడించారు.

ముఖంపై గాయాలకు ప్రత్యేక శస్త్రచికిత్స

- జీజీహెచ్‌లో వైద్యుల ఘనత
- అభినందించిన వైద్యాధికారులు



కోలుకుంటున్న సంజయ్

కోల్‌సిటీ(రామగుండం): ఓ యువకుడి ముఖంపై తగిలిన తీవ్రగాయాలకు గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) వైద్యులు కఠినతరమైన ఆపరేషన్ చేసి శభాష్ అనిపించుకున్నారు. ఈ తరహా శస్త్ర చికిత్స చేయడం జీజీహెచ్‌లో ఇదే తొలిసారి కావడం గమనార్హం. జంగ సంజయ్ అనే యువకుడు ఇటీవల బైక్‌పై నుంచి పడిపోగా.. ముఖ్యంపై తీవ్రగాయాలయ్యాయి. ఆ గాయాలు నయం కావడానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో ఇటీవల జీజీహెచ్‌లో చేరాడు. పరీక్షించిన దంత వైద్య విభాగం నిపుణులు.. ఆ యువకుడికి శస్త్ర చేయడానికి నిర్ణయించారు. నిపుణుల ఆధ్వర్యంలో ముఖంపై ఎడమ ఆర్బిటల్ ఫ్లోర్, రిమ్, ఎడమ జైకోమటిక్–మెక్సిల్లరీ ఎముకలకు ఉన్న పగుళ్లను ఓపెన్ రిడక్షన్–ఇంటర్నల్ ఫిక్సషన్ (ఒరిఫ్)తోపాటు మ్యాక్సీల్లో మాండ్డబుల్ ఫిక్సషన్ (ఎంఎంఎఫ్) అనే కఠినమైన మినీ ఇంప్లాంట్లను కుదుర్చుతూ శస్త్ర చికిత్స నిర్వహించారు. అనంతరం పేషెంట్ కంటిచూపు, చెవి, ముక్కు, గొంతు కదలికలన్నీ సక్రమంగా ఉన్నాయని, వేగంగా కొలుకుంటున్నాడని వైద్యులు వెల్లడించారు. ఇలాంటి ఆర్బిటాల్ ఎస్ప్లోరేషన్ – ఆర్బిటాల్ ఫ్రాక్చర్ల శస్త్రచికిత్సలను ఇప్పటి వరకు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలోనే చేస్తున్నారని పేర్కొన్నారు. తొలిసారి గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిర్వహించటం విశేషమని వివరించారు. దంత వైద్యులు, అనెస్తీషియా బృందాన్ని సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్ అభినందించారు. పేషెంట్ సంజయ్ సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ. పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1185491]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 18K. Ph: 9640258899, 9640468899 [HA-1381]

■ ఆఫ్రికాదేశంలో పనిచేయుటకు బికాం అకౌంటెంట్‌లు, బార్ టెండర్లు, సూపర్ మార్కెట్లో సూపర్‌వైజర్, ప్లంబర్లు, ఎలక్ట్రిషన్లు, మార్కెటింగ్, బైక్, కార్ డ్రైవర్లు జాబ్‌లు కలవు. 8179671672 [SCA24000482]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824